నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 25 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

## సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 24 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిర్వహించే సాంకేతిక శిక్షణ కోర్సులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడున్నర నెలల కాల పరిమితి గల బేసిక్ కంప్యూటర్స్ (విద్యార్హత ఇంటర్మీడియట్), ఎకౌంట్ అసిస్టెంట్ ట్యాలీ (బీకాం పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (ఇంటర్మీడియట్), ఆటో మొబైల్, 2 వీలర్ సర్వీసింగ్ (పదో తరగతి), సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ రిపేర్ (పదో తరగతి), ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ (పదో తరగతి, ఐటీఐ), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ సర్వీస్ (పదో తరగతి) కోర్సులు నేర్పనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్ ఫొటో, ఆధార్ కార్డ్, రేషన్ కార్డులతో జనవరి 2న రామనంద తీర్థ సంస్థలో హాజరు కావాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 91339 08000, 91339 08111, 913390 8222, 99484 66111 నంబర్లను సంప్రదించాలని కోరారు.



జంగిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా నేతలు

## మాజీ ఎమ్మెల్యే మర్రికి ఉమ్మడి జిల్లా నేతల పరామర్శ

నీలగిరి, డిసెంబర్ 24 : నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి ఇటీవల మృతి చెందగా, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నేతలు నివాళులర్పించారు. గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితోపాటు మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం నేరేళ్లపల్లి గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి జనార్దన్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బోనగిరి దేవేందర్ ఉన్నారు.

# పెరిగిన సైబర్ నేరాలు

- ఆందోళన కలిగిస్తున్న లైంగిక దాడి కేసులు
- మొత్తంగా 5,576 ఎఫ్ఐఆర్‌లు.. 4,368 కేసులు పరిష్కారం
- ట్రాఫిక్-1లో 9,505 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- డయల్ 100కు 30,909 ఫోన్ కాల్స్
- రాచకొండ పోలీస్ వార్షిక నివేదిక వెల్లడి

## యాదాద్రి భువనగిరి జిల్లాలో 169 శాతం పెరిగిన సైబర్ క్రైమ్

**యాదాద్రి జోన్ పరిధిలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 169 శాతం కేసులు పెరిగాయి. మరోవైపు లైంగిక దాడి కేసులు కూడా అధికమయ్యాయి. అలాంటి కేసుల్లో ఎక్కువగా స్నేహితులే దోషులుగా ఉన్నారు. ట్రాఫిక్-1 పరిధిలో 9,505 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ విషయాలను రాచకొండ పోలీస్ వార్షిక నివేదిక-2024లో వెల్లడిస్తున్నది.** *– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ)*

యాదాద్రి జోన్‌లో సైబర్ నేరగాళ్ల బెడద పెరుగుతున్నది. ముఖ్యంగా సోషల్ మీడియా, పార్ట్‌టైం జాబ్, ఫిషింగ్, ఫేక్ కస్టమర్ కేర్, లోన్ యాప్ వేధింపులు, జాబ్, వీసా, లోన్లు, గిఫ్ట్, లాటరీ పేరుతో మోసాలు, డేటా చౌర్యం, ఓఎల్ఎక్స్, క్వికర్, ఇతర మార్కెటింగ్ కంపెనీలు, క్రిప్టో, ఇన్వెస్ట్‌మెంట్, మ్యాట్రిమోనల్ తదితర రకాల పేరుతో సైబర్ నేరాలు చోటుచేసుకున్నాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాది 2,562 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 4,458 కేసులు అయ్యాయి. 42.5శాతం నేరాలు పెరిగాయి. యాదాద్రి జోన్ విషయానికొస్తే.. గతేడాది 49 సైబర్ క్రైమ్ కేసులు ఉండగా, ఈ ఏడాది 132 కేసులు రిజిస్టర్ అయ్యాయి. 169 శాతం కేసులు పెరిగాయి.





### 5,576 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్..

యాదాద్రి జోన్ పరిధిలో 5,576 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ అయ్యాయి. వాటిల్లో 4,368 పరిష్కరించగా, మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. 1271 కేసుల్లో కోర్టులు శిక్ష విధించాయి. మోటకొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ సంచలన మర్డర్ కేసులో 14 మందికి జీవిత కారాగార శిక్ష పడింది. ఈ ఏడాది 19 జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, గతేడాది 35 కేసులు రిజిస్టర్ అయ్యాయి. డయల్ 100కు 30,909 ఫిర్యాదులు అందాయి. సగటున ప్రతి 10.55 నిమిషాలకు ఒక కాల్ వచ్చింది. 14,503 ఈ-పిటి కేసులు బుక్ అవ్వగా, 9,820 కేసులను పరిష్కరించారు. పలు కేసుల్లో గతేడాది 289 మందికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇవ్వగా, ఆ సంఖ్య ఈసారి 726కి పెరిగింది. భువనగిరి సీసీఎస్ పరిధిలో ఈ ఏడాది దొంగతనాలు, చోరీలు కొద్దిమేర తగ్గుముఖం పట్టాయి. ఈ అంశంలో 60 కేసులు నమోదు కాగా, రూ.78.04 లక్షలను పోలీసులు రికవరీ చేశారు.

### 9,505 డ్రంకెన్ డ్రైవ్ కేసులు..



రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్-1లో ఈ ఏడాది మొత్తం 9,505 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 77 మందికి జైలు శిక్ష పడింది. కోర్టులు రూ.2.03 కోట్ల జరిమానా విధించాయి. 9,359 మందికి డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసుల్లో 1,768 మంది డ్రైవింగ్ లైసెన్సను సస్పెండ్ చేశారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసిన 39,356 మందికి చలానా విధించారు. ఓవర్ స్పీడ్‌కు సంబంధించి 16,330, సెల్ ఫోన్ డ్రైవింగ్ 6,840, సిగ్నల్ జంప్ 28,616, నెంబర్ ప్లేట్ సరిగ్గా లేనివి 36,755, రాంగ్ సైడ్ డ్రైవింగ్ 63,879, ట్రిపుల్ రైడింగ్ 25,445, నో ఎంట్రీ ఉల్లంఘనలు 18,339, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసిన కేసులు 39,356, సీటు బెల్ట్ పెట్టుకోని 17,531 కేసుల్లో చలానాలు విధించారు.

### మహిళలపై 3,172 రకాల నేరాలు



రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 3,172 మంది మహిళలపై వివిధ రకాల నేరాలు జరిగాయి. ప్రధానంగా లైంగిక దాడి కేసులు పెరిగాయి. కమిషనరేట్ పరిధిలో గతేడాది 327 కేసులు నమోదవగా, ఈ ఏడాది 384 కేసులు రిజిస్టర్ అయ్యాయి. ఈ కేసుల్లో పోలీసుల దర్యాప్తుల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. లైంగిక దాడి కేసుల్లో అధిక శాతం స్నేహితులే ఉన్నట్లు తేలింది. అత్యధికంగా స్నేహితులే (322మంది)ఈ దారుణాలకు పాల్పడినట్లు బయటపడింది. 17 కేసుల్లో ఇరుగు పొరుగు వ్యక్తులు, ఐదుగురు కుటుంబ సభ్యులు, 402 మంది ఇతరుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు నివేదికలో పేర్కొన్నారు. మొత్తంగా మహిళలపై నేరాలు 2022తో పోలిస్తే 2023లో 12.10శాతం తగ్గుముఖం పట్టగా, 2024లో మాత్రం 9శాతం మాత్రమే తగ్గడం గమనార్హం.



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన భువనగిరిలోని పునీతా బోజప్ప దేవాలయం

## మెర్రీ క్రిస్మస్

రామగిరి, సూర్యాపేట టౌన్, డిసెంబర్ 24 : ప్రేమమూర్తి ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఎక్కడికక్కడ చర్చీలు విద్యుద్దీపాల కాంతుల్లో వెలుగులీనుతున్నాయి. క్రైసవ మత పెద్ద ప్రార్థనల నడుమ మంగళవారం అర్ధ రాత్రి చర్చీల్లో కేక్ కేటింగ్‌లు చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక ప్రార్థనలకు చర్చీలను ముస్తాబు చేశారు.

### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి శుభాకాంక్షలు

శాంతి, సామరస్యాలకు ప్రతీకగా జరుపుకొనే పండుగ క్రిస్మస్ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా క్రైస్తవులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం వంటివన్నీ క్రీస్తు తన జీవితం ద్వారా మానవాళికి అందించిన మహోన్నత సందేశాలన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్ ఓ ప్రకటనలో క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్యాం బెనగల్ యాదిలో పోచంపల్లి

- నేతన్నల బతుకు చిత్రం 'సుస్మన్'ను తెరకెక్కించిన దర్శక దిగ్గజం
- 45రోజులపాటు ఇక్కడే సినిమా చిత్రీకరణ



చేనేత కళాకారుడు చిలువేరు రామలింగం రూపొందించిన పచ్చీసును తిలకిస్తున్న సినీ దర్శకుడు శ్యామ్ బెనగల్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 24 : కళాత్మక చిత్రాలకు పెట్టింది పేరైన దర్శక దిగ్గజం, పద్మభూషన్ శ్యామ్ బెనగల్‌కు భూదాన్‌పోచంపల్లితో ఎంతో అనుబంధం ఉంది. హైదరాబాదీ అయిన ఆయన సామాన్యుల బతుకు చిత్రాన్ని వెండి తెరపై చూపించారు. ఈ క్రమంలోనే 1985లో చేనేత కార్మికుల సమస్యలు, సహకార సంఘాల వైఫల్యం, సంప్రదాయ వారసత్వ కళ చితికిపోతున్న తీరును కండ్లకు కడుతూ హిందీలో సుస్మన్ అనే చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రముఖ నటుడు ఓం పూరి, నటి షబనాఅజ్మీ నటించారు. ఈ సినిమానూ పోచంపల్లిలోని ప్రముఖ చేనేత కళాకారుడు చిలువేరు రామలింగం ఇంట్లో, చేనేత సహకార సంఘం ఆవరణలో చిత్రీకరించారు. కొంగరి సుందరయ్య అనే చేనేత కార్మికుడి ఇంట్లోనూ షూటింగ్ చేశారు. సుమారు 45 రోజులపాటు చిత్రీకరణ సాగగా, ఆ కాలంలో వాహన సదుపాయం అంతగా లేకపోవడంతో యూనిట్ బృందం 101 దర్వాజల భవనంలో బస చేసింది. శ్యాంబెనగల్‌తోపాటు ఓం పూరి, షబనా అజ్మీ, పల్లవి జోషి అప్పుడప్పుడు రామలింగం ఇంట్లో బస చేసేవారు.

ఆ ఇంట్లోనే రిహార్సల్స్ చేసేవారు. పచ్చీసు కుర్తా పైజామాను మగ్గంపై నేసే నేత కళాకారుడు చిలువేరు రామలింగం సాయం తీసుకున్నారు. బోనాల పండుగకు బండిపై మగ్గాన్ని ఏర్పాటు చేసి మొగ్గం నేస్తూ దేవాలయాన్ని వెళ్లేలోపు చీరను పూర్తి చేసి అమ్మవారికి సమర్పించారు. ఓంపూరికి మగ్గాన్ని నేర్పించారు. ఈ సినిమాకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. 1987లో విడుదలైన సినిమాను పనోరమ ఫిలిం ఫెస్టివల్, ది చికాగో ఫిలిం ఫెస్టివల్, వాన్కోవర్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్, సిడ్నీ ఫిలిం ఫెస్టివల్‌లోనూ ప్రదర్శించారు. సినిమా చిత్రీకరణ సమయంలో పోచంపల్లి ప్రజలతోపాటు చుట్టుపక్కలవాళ్లు నిత్యం ఇక్కడికి వస్తుండేవారు. అలా చిత్ర బృందంలోని ముఖ్యమైన వ్యక్తులపై ప్రత్యేక అభిమానం నింపుకొన్నారు.



కలెక్టర్ చాంబర్‌లో దర్జాగా కూర్చొని ఫోన్ మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు



కలెక్టర్ చాంబర్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## కలెక్టర్ చాంబరా? కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా?

### కాంగ్రెస్ నేతల ఇష్టారాజ్యం

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 24 : జిల్లా మేజిస్ట్రేట్ అయినటు వంటి కలెక్టర్ చాంబర్‌ను కాంగ్రెస్ నేతలు పార్టీ కార్యాలయంలా మార్చేశారు. మంగళవారం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌కు వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలెక్టర్ చాంబర్‌లోకి గుంపుగా దూసుకువచ్చారు. అనుమతి లేకుండా అంతమంది రావద్దని కార్యాలయం సిబ్బంది వారించినా వినకుండా ఆఫీసులో హంగామా చేశారు. కలెక్టర్ చాంబర్‌లోని కుర్చీలు, సోఫాల్లో కాలు మీద కాలు వేసుకుని దర్జాగా కూర్చున్నారు. కలెక్టర్ కుర్చీ వెనుక ఉండే మూడు సింహాల చిహ్నం, జాతీయ జెండాను కింద పడవేశారు. కాంగ్రెస్ నేతల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపరిచేలా అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందించేందుకు వచ్చారు. ఆ సమయంలో వారి వెంట వచ్చిన నాయకులు కలెక్టర్ చాంబర్‌లో నానా హంగామా చేశారు. కలెక్టర్ ఇతర కార్యక్రమాలకు హాజరు అయ్యేందుకు చాంబర్ నుంచి బయటకు వెళ్లినా కాంగ్రెస్ నేతలు ఆ చాంబర్‌లోనే చాలాసేపు ఉండిపోయారు. వివిధ సమస్యల మీద కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చే సామాన్య ప్రజలకు నానా ఆంక్షలు చెప్పే అధికారులు కాంగ్రెస్ నేతల విషయంలో మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది.



కలెక్టర్ కుర్చీ వెనుక ఉన్న జాతీయ జెండా కర్ర పైనుంచి పడిపోయిన మూడు సింహాల చిహ్నం





హుజూర్‌నగర్ కోర్టులో ఏర్పాటు చేసిన ఈ-సేవ కేంద్రం

## కక్షిదారుల కోసం ఈ-సేవ

హుజూర్‌నగర్, డిసెంబర్ 24 : పట్టణంలోని కోర్టులో కక్షిదారుల కోసం ఈ -సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మంగళవారం ఈ-సేవ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్టంలోని వివిధ న్యాయ స్థానాల్లో ఏర్పాటు చేసిన 29 ఈ-సేవ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రాల వల్ల జైలులో ఉన్న ఖైదీలతో వారి కుటుంబ సభ్యులు ములాఖత్ కావచ్చు. కోర్టులోని రికార్డుల నకలు కేంద్రం ద్వారా పొందవచ్చు. దీంతో కక్షిదారులకు న్యాయస్థానాల కార్యకలాపాలు మరింత చేరువ కానున్నాయి.





నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## ఒంటి కాలుపై నిలబడి సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

రామగిరి, డిసెంబర్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యా శాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు రోజుకో రీతిన ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. నల్లగొండ కలెక్టరేట్ వద్ద 15 రోజులుగా దీక్ష చేస్తున్న ఉద్యోగులు మంగళవారం ఒంటి కాలుపై నిరసన తెలిపారు. డీటీఎఫ్ తోపాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రెండు వారాలుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

## రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 24 : యాసంగిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రుణమాఫీ, రైతుబీమా, పీఎం కిసాన్, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై జిల్లా వ్యవసాయ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అర్హులకు రుణమాఫీ వర్తించేలా, మృతి చెందిన రైతు కుటుంబాలకు బీమా డబ్బు త్వరిత గతిన అందేలా చూడాలన్నారు. పీఎం కిసాన్ కోసం ఈ కేవైసీ, ఆధార్ సీడింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఏడీఓ నీలిమ, అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

## 28 నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

- నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో మూడు రోజులపాటు నిర్వహణ
- విద్యారంగంలోని అసమానతలు, అంతరంగాలపై చర్చ
- ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి

నీలగిరి, డిసెంబర్ 24 : ఈ నెల 28 నుంచి 30 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో టీఎస్ యూటీఎఫ్ 6వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ మహాసభల్లో విద్యారంగంలో అసమానలు, అంతరాలు లేకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు వివరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలో తొలిరోజు సుమారు 7వేల మంది ఉపాధ్యాయులతో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు తెలిపారు. దేశంలో సామాజిక ఆర్థిక అంతరాలు తగ్గించేందుకు రాజ్యాంగం ఏర్పాటు చేశారని, విద్యద్వారానే అంతరాలు పోవాలంటే అందరూ ఒకే రకమైన బడిలో చదువాలని అన్నారు.

అసమానమైన విద్య ప్రజల మధ్య అసమానతలను పెంచుతుందన్నారు. ఢిల్లీ, కేరళ వంటి రాష్ట్రాల్లో మాత్రమే విద్యలో ఉన్నత స్థాయిలో ఉన్నాయని, మిగతా రాష్ట్రాల్లో పాలకుల కుట్రల వల్లే విద్యలో అంతరాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసాచారి, కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షులు బి.అరుణ, నర్రా శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.అరుణ, జిల్లా కార్యదర్శులు రమాదేవి, నల్పరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమర్రాజు సైదులు పాల్గొన్నారు.